సాక్షి
చిత్తూరు
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



జర్నలిస్టులకు రక్షణేదీ?
కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని జిల్లా కేంద్రంలో బుధవారం ఆందోళన చేపట్టారు. - 4లో



టైర్ పరిశ్రమలో భారీ పేలుడు
నగరిలోని టైర్ల పరిశ్రమలో బుధవారం భారీ పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. - 4లో



ప్రైవేటు చేతికి అస్త్రం
ప్రభుత్వ సేవలను ప్రైవేటు పరం చేయడంతో వాహన సామర్థ్య పరీక్షలు ప్రైవేటు నిర్వాహకుల చేతిలోకి వెళ్లనున్నాయి. - 4లో

న్యూస్‌రీల్

వేసవి సెలవులు.. దొంగలతో జాగ్రత్త

చిత్తూరు అర్బన్ : పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో.. విహార యాత్రలు, ఊర్లకు వెళ్లే ప్రజలు ఇంట్లో చోరీలు జరగకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో కోరారు. ఎవరైనా బయటి ప్రాంతాలకు వెళితే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలా చేస్తే తాళం వేసిన ఇళ్లపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అలాగే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. దీనికితోడు జిల్లా వ్యాప్తంగా 16,500 స్మార్ట్ డోర్ లాక్స్ సైతం పంపిణీ చేశామన్నారు. ఎవరైనా బయటి ఊర్లకు వెళితే ఫోన్ 112, పోలీసు వాట్సాప్ 94409 00005 నంబర్లకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి, పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

28 నుంచి వేసవి శిక్షణ తరగతులు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని గ్రంథాలయాల నందు ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు డిప్యూటీ గ్రంథాలయాధికారి లలిత తెలిపారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, డాన్స్, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఆ రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తరగతులు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఊపందుకున్న 'గుజ్జు' పరిశ్రమలు


- కేరళ నుంచి 'మామిడి' దిగుమతి



చిత్తూరు నగరంలోని ఓ ఫ్యాక్టరీకి చేరుకున్న మామిడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు జిల్లాలో కొన్ని మామిడి గుజ్జు పరిశ్రమలు తెరుచుకున్నాయి. అప్పుడే గుజ్జు తయారీని మొదలుపెట్టాయి. జిల్లాలో 47 గుజ్జు పరిశ్రమలుండగా... నాలుగు పరిశ్రమలు గుజ్జు తయారీని ప్రారంభించాయి. కేరళ నుంచి అల్ఫోన్సో రకం కాయలను దిగుమతి చేసుకుంటున్నాయి. గుజ్జు తయారీని ఆచితూచి చేస్తున్నాయి. ఇలా నిత్యం 90 టన్నుల వరకు దిగుమతి అవుతున్నట్లు పరిశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు. కాగా జిల్లాలో గతేడాది మామిడి గుజ్జు 2.75 లక్షల టన్నుల తయారీ చేసి నిల్వ చేశారు. యుద్ధాలు, ఇతర కారణాల వల్ల గుజ్జు నత్తనడకన అమ్ముడుపోతున్నాయి. ఇప్పటి వరకు 50 శాతం వరకు అమ్ముడుపోయిందని పరిశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు. పరిశ్రమదారులు పట్టుబట్టి విదేశాల ఎగుమతిపై దృష్టి పెట్టారు. దీని కారణంగా గుజ్జు ఎగుమతులు కదులుతున్నాయి.

టెక్నాలజీతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: టెక్నాలజీని సంస్కృత శాస్త్రాలలో విరివిగా వినియోగించుకుని విద్యార్థులు జ్ఞానాన్ని పొందాలని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సూచించారు. వర్సిటీలో జాతీయ సంస్కృత వర్సిటీ, సీడాక్ సంస్థ సంయుక్తంగా ఏఐ, ఎంఎల్, క్వాంటం కంప్యూటింగ్, ఐకేఎస్‌పై రెండు రోజులు నిర్వహించిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ సంస్కృతాన్ని ఆధునిక సమాజానికి అందించాలంటే టెక్నాలజీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐబీటీ ప్రొఫెసర్ కృష్ణప్రపూర్ణ, విభాగాధిపతి ప్రొఫెసర్ గణపతి భట్, ప్రొఫెసర్ రమాశ్రీ, డాక్టర్ జానకి, ప్రొఫెసర్ చంద్రశేఖరం, శ్రీధర్, నాగలక్ష్మీ, ప్రసన్న పాల్గొన్నారు

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 61,828 మంది స్వామిని దర్శించుకున్నారు. 21,165 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నిరాశ పది



పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల కాగా అందులో జిల్లాకు తీవ్ర నిరాశే ఎదురైంది. సీఎం సొంత జిల్లా రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచి అందరినీ విస్మయానికి గురి చేసింది. 67.06 శాతం ఉత్తీర్ణత సాధించి అటు విద్యాధికారులు, ఇటు తల్లిదండ్రులను తీవ్ర నిరాశ పర్చింది. గతేడాది జిల్లా 6వ స్థానంలో ఉండగా నేడు ఏకంగా 24వ స్థానానికి పడిపోవడంతో మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం ఇలాకాలో పది ఫలితాలు దారుణంగా పడిపోవడంపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఊరట చెందాల్సిన అంశం బాలికలు 73.20 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా పరువు నిలబెట్టారు.

బాలికలదే హవా
- పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు 24వ స్థానం
- సీఎం జిల్లాలో దారుణ ఫలితాలు
- గతేడాది 6వ స్థానం నుంచి 24కు దిగజారిన వైనం
- 67.06 శాతం ఉత్తీర్ణత నమోదు
- 20,796 మందికి 13,946 మంది ఉత్తీర్ణత
- జిల్లా ఫలితాలు విడుదల చేసిన డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను బుధవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి లోకేశ్ విడుదల చేశారు. ఈ ఫలితాల్లో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 26 స్థానాల్లో 24వ స్థానంలో నిలిచింది. సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు 24వ స్థానంలో నిలవడం ఆందోళనకు గురి చేసింది. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు సాధించిన ఫలితాలను డీఈఓ వరలక్ష్మి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈవోలు, సిబ్బంది మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఏటా లాగే ఈ ఏడాది సైతం బాలుర కంటే బాలికలే జిల్లాలో ముందంజలో నిలిచారు. ఫలితాల్లో బాలుర కంటే బాలికలు 11.9 శాతం ఎక్కువ ఉత్తీర్ణతను కైవసం చేసుకున్నారు.

దిగజారిన జిల్లా స్థానం.
సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు స్థానం పదో తరగతి ఫలితాల్లో దిగజారింది. గత విద్యాసంవత్సరంలో చిత్తూరు జిల్లా స్థానం రాష్ట్రంలో 6వ స్థానం సాధించగా ఈ విద్యాసంవత్సరం 24వ స్థానానికి పడిపోయింది. రాష్ట్రంలో చిత్తూరు జిల్లా స్థానం 67.06 శాతం నమోదైంది. గత విద్యాసంవత్సరం కంటే ఫలితాలు తగ్గడంపై క్షేత్రస్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

6,850 మంది ఫెయిల్
జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 6,850 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గత విద్యాసంవత్సరం 1826 మంది విద్యార్థులు పరీక్షలు తప్పారు. ఈ విద్యా సంవత్సరం అంత కంటే ఎక్కువగా పరీక్షల్లో ఫెయిల్ కావడం విమర్శలకు తావిస్తోంది. ఈ విద్యాసంవత్సరం జిల్లాలో 20,796 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13,946 మంది ఉత్తీర్ణత చెందగా 6,850 మంది పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు.

జిల్లా ఫలితాల సమాచారం

పరీక్షలు రాసిన బాలురు 10,723	ఉత్తీర్ణత శాతం 61.30 శాతం
ఉత్తీర్ణత చెందిన బాలురు 6,573	
పరీక్షలు రాసిన బాలికలు 10,073	ఉత్తీర్ణత శాతం 73.20 శాతం
ఉత్తీర్ణత చెందిన బాలికలు 7,373	
ఫెయిల్ అయిన విద్యార్థులు 6,850	



జిల్లా ఫలితాలు విడుదల చేస్తున్న డీఈఓ వరలక్ష్మి

ఉత్తమ ఫలితాల్లోనూ అథమ స్థానమే..
జిల్లా వ్యాప్తంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో మొదటి డివిజన్‌లో 10,096 మంది ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ పరీక్షల్లో 13,946 మంది ఉత్తీర్ణత సాధించగా అందులో మొదటి డివిజన్‌లో 10,096, రెండో డివిజన్‌లో 2,562, మూడో డివిజన్‌లో 1,288 మంది ఉత్తీర్ణత పొంది ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ మూడు డివిజన్‌ల ఉత్తమ ఫలితాల సాధనలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 20వ స్థానంలో నిలిచింది.

ప్రభుత్వ బడుల్లో మెరిసిన పేదింటి బిడ్డలు



ప్రభుత్వ పాఠశాలలో చదివి నగరం ఫస్ట్ వచ్చిన కౌసర్‌కు మిఠాయి తినిపిస్తున్న డీఈఓ

జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. గత ఐదేళ్లపాటు వైఎస్సార్‌సీపీ విద్యాభివృద్ధికి తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేశాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు టాప్ మార్కులు సాధించి సత్తా చాటారు.

సందేహం ఉంటే ..
పదో తరగతి పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినా.. బాగా రాసి ఫెయిల్ అయినా.. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున మే1వ తేదీ రాత్రి 11 గంటల లోపు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 19వ తేదీ నుంచి మే 28వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు మే 30 వ తేదీ లోపు అపరాధ రుసుం లేకుండా, రూ.50 అపరాధ రుసుంతో మే 1 నుంచి 18 వ తేదీ లోపు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

ఓపెన్ 'పది' బోల్తా

- పదిలో 8.91 శాతం, ఇంటర్‌లో 20.05 శాతం



చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షా ఫలితాల్లో చిత్తూరు జిల్లా బోల్తా కొట్టింది. ఈ విద్యాసంవత్సరం జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలను విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. దీంతో ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో పాటు అత్యధికంగా అభ్యర్థులు ఫెయిల్ అయ్యారు.

పది ఫలితాల్లో..
ఏపీ ఓపెన్ స్కూల్‌లో గతంలో ఎన్నడూ నమోదు కాని విధంగా ఈ సంవత్సరం పది ఫలితాల్లో 8.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పురుషులు 506, మహిళలు 358 మొత్తం 864 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో పురుషులు 61, మహిళలు 16 మంది మొత్తం 77 మంది ఉత్తీర్ణులయ్యారు. పురుషులు 12.06 శాతం, మహిళలు 4.47 మొత్తం 8.91 శాతం జిల్లా ఉత్తీర్ణత నమోదైంది. 787 మంది ఫెయిల్ అయ్యారు. ఓపెన్ పది పరీక్షల్లో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 20 స్థానంలో నిలిచింది.

ఇంటర్‌లో ..
ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫలితాల్లో చిత్తూరు జిల్లా ఉత్తీర్ణత శాతం 20.05 నమోదైంది. ఈ పరీక్షలకు పురుషులు 2005, మహిళలు 1003 మొత్తం 3008 మంది హాజరయ్యారు. వీరిలో పురుషులు 360, మహిళలు 243 మొత్తం 603 మంది ఉత్తీర్ణులయ్యారు. పురుషులు 17.96, మహిళలు 24.23 మొత్తం 20.05 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా రాష్ట్రంలో చిత్తూరు జిల్లా 20వ స్థానంలో నిలిచింది. ఈ పరీక్షల్లో 2405 మంది ఫెయిల్ అయ్యారు.

ఉగ్రదాడి పిరికి చర్య



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్

- కశ్మీర్ ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ
- పాల్గొన్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్

చిత్తూరు కార్పొరేషన్ : కశ్మీర్‌లో జరిగిన దాడితో భారతీయుల ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. దాడికి కారణమైన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రదాడికి నిరసనగా ఆ పార్టీ ఆధ్వర్యంలో నగరంలో రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి గాంధీవిగ్రహం వరకు నాయకులతో కలిసి దాడులను ఖండిస్తూ నినాదాలు చేశారు. కాల్పుల్లో 26 మంది చనిపోవడం, 20 మందికి పైగా గాయాలపాలవడం బాధాకరమన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ , మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి మాట్లాడారు. కుటుంబ సభ్యులతో విహారయాత్రకు వెళ్లిన వారిని ఇలా చంపడం అత్యంత హేయమన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి ఇలాంటి పిరికిపింద చర్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, గుడిపా మండల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు , ప్రజాప్రతినిధులు సరళమేరి, అంజలిరెడ్డి, ఆను, రజనీకాంత్, అన్బు, లక్ష్మణస్వామి, చల్లాముత్తు, దేవరాజు, శేఖర్, సురేష్, రాజశేఖర్, మనోహర్‌రెడ్డి, స్టాండ్లీ, శివ, చాన్‌బాషా, అల్తాఫ్, అఫ్జల్‌ఖాన్, చామంతి, రంజిత్, రాజేష్, శాంతి, హరీషారెడ్డి, సెల్వ పాల్గొన్నారు.

సదరం.. గందరగోళం



ఇరుకు గదిలో దివ్యాంగుల ఇబ్బందులు

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అవస్థలు
- దివ్యాంగులకు తప్పని అగచాట్లు
- టోకెన్ల జారీలో నిర్లక్ష్యం
- కనిపించని సచివాలయ సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం సదరం ధ్రువపత్రాల పరిశీలన గందరగోళంగా మారింది. దివ్యాంగులు పరిశీలనలో అగచాట్లు పడ్డారు. టోకెన్ల కోసం గొడవలకు దిగారు. సకాలంలో సచివాలయ సిబ్బంది టోకెన్లు ఇవ్వకుండా దివ్యాంగులకు అవస్థలకు గురిచేశారు. దీంతో ఆస్పత్రి పలు విభాగాల వద్ద అరుపులు కేకలతో దద్దరిల్లింది. అక్కడ కనీస వసతులు లేకపోవడంతో దివ్యాంగులు మండిపాటుకు గురయ్యారు.

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం సదరం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు మానసిక, వికలాంగత్వ, వినికిడి లోప లబ్ధిదారులు 200 మంది దాకా వచ్చారు. దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, కట్టమంచి ప్రాంతాల్లోని దివ్యాంగులు ఈ పరిశీలనకు హాజరయ్యారు. సచివాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఆ 200 మంది ఉదయం 8 గంటలకే ఆస్పత్రికి చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు ఆస్పత్రంతా దివ్యాంగులు, వారి సహాయకులతో నిండిపోయింది. దీంతో అటు వైపు వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడ్డారు.

ఇరుకైన గదిలో పరీక్షలు



నేలపైనే పడుకున్న పింఛన్‌దారుడు

చికిత్స తీసుకుని ఇంజెక్షన్ వేసుకునేందుకు వచ్చిన వారికి గదిలో వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. అలాగే అత్యవసర విభాగం సమీపంలో పరీక్ష చేసే కేంద్రం వద్ద గుమికూడారు. ఈగది వద్ద నువ్వా..నేనా నంటూ పోటీ పడ్డారు. అరుపులు కేకలతో వారు ఉన్న పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. ఇరుకైనా గదిలో పరీక్షలు చేయడంతో వైద్యులు కూడా ఇబ్బందులు పడ్డారు. అక్కడ సరైన వసతులు లేక మానసిక లబ్ధిదారులు, వికలాంగత్వ పింఛన్‌దారులు నేలపైనే సేదతీరాల్సిన పరిస్థితి ఎదురైంది.

తాగునీరుంటే ఒట్టు..
అసలే ఎండా కాలం. కనీసం కేంద్రాల వద్ద తాగునీటి వసతి లేకపోవడంతో పరిశీలనకు వచ్చిన వారు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. అన్ని విభాగాల వద్ద వారికి ఇదే పరిస్థితి ఎదురైంది. అధికారులు అన్ని వసతులు కల్పించామని చెబుతున్నా అందుకు తగ్గట్లు వసతులు కనిపించలేదు. దీంతో వారు గుక్కెడు నీటి కోసం ఇక్కట్లు పడ్డారు. కుర్చీలు లేక గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. నేలపైనే కూర్చున్నారు..పడుకున్నారు. అధికారులు స్పందించి వారికి సమస్యలు లేకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది ఆలస్యం
వైద్యులు 9 గంటలకు ఆస్పత్రికి వస్తే...సచివాలయ సిబ్బంది మాత్రం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి టోకెన్లు ఇచ్చారు. అంత వరకు దివ్యాంగులు టోకెన్ల కోసం పడిగాపులు కాశారు. ఆపై వచ్చిన సచివాలయ సిబ్బంది టోకెన్లు ఇచ్చేందుకు గందరగోళం సృష్టించారు. అందరిని గుంపుగా చేర్పించి ఇష్టానుసారంగా టోకెన్లు పంపిణీ చేయించారు. దీంతో అక్కడ తోపులాట చోటు చేసుకుంది. మధ్యాహ్నం లబ్ధిదారుల సహాయకులు గొడవ పడ్డారు. ఇది గమనించిన ఆస్పత్రి సిబ్బంది వారిని సర్దుబాటు చేసి కూర్చోబెట్టారు. పింఛన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు సచివాలయ సిబ్బంది అక్కడే ఉండాలి. కానీ ఒక్కరు లేరు. సాయంత్రం 4 గంటల వరకు కూడా గందరగోళం మధ్య పరిశీలన ప్రక్రియ కొనసాగింది.



టోకెన్ల కోసం దివ్యాంగులు, సహాయకులు

ఇబ్బందులు లేకుండా చేపట్టాలి



తన కొడుక్కి మానసిక సమస్య. ఈ శిబిరానికి తీసుకొచ్చా. గుంపులో తోలేశారు. ఇలా ఇబ్బంది పెట్టిస్తే ఎలా. దివ్యాంగులను ఇలా చేయడం ఏమైనా కరెక్టా. తెల్లారి నుంచే అవస్థలు పడుతున్నాం. సకాలంలో సచివాలయ సిబ్బంది టోకెన్లు ఇవ్వలేదు. తోపులాట మధ్య టోకెన్లు తీసుకున్నాం. ఇబ్బందులు లేకుండా పరిశీలన చేపడితే బాగుంటుంది.
– గీతా, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు (సహాయకురాలు)

మధ్యాహ్నం టోకెన్లు ఇచ్చారు



తెల్లారి వచ్చాం.. మాకొడుక్కి మానసిక సమస్య. తిండి కూడా తెచ్చుకోలేదు. సచివాలయం వారు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి టోకెన్లు ఇచ్చారు. క్యూ లేదు..ఏమీ లేదు. గుంపులో గోవిందా అంటూ టోకెన్లు ఇచ్చారు. చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడిస్తే ఎప్పుడు పరీక్ష చేసుకోవాలి. ఇంటికి ఎప్పుడెళ్లాలి.
–గిరిజ, దొడ్డిపల్లి, చిత్తూరు (సహాయకురాలు)

ఉత్తమ ఫలితాలు..
ఉన్నతాశయాలు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతాశయంతో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రణాళికతో విద్యనభ్యసిస్తామని చెబుతున్నారు. నగరంలోని పలు పాఠశాలల్లో ఉన్నత ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇలా..

విద్యార్థి పేరు : **మోహిత్**
మార్కులు : **596/600**
తల్లిదండ్రులు : **సునీత, సెల్వరాజ్ (చిత్తూరు ఎంఈఓ)**
ఊరు : చిత్తూరు
లక్ష్యం : శాస్త్రవేత్త



తల్లిదండ్రులతో విద్యార్థి మోహిత్

విద్యార్థి పేరు : **పల్లవి**
మార్కులు : **596/600**
తల్లిదండ్రులు : **అరుణ, శరవణ.**
ఊరు : చిత్తూరు
లక్ష్యం : సాఫ్ట్‌వేర్



మాజీ సైనికులకు మెరుగైన సేవలు

చిత్తూరు కలెక్టరేట్ : మాజీ సైనికులకు మెరుగైన సేవలందించాలని డీఆర్‌వో మోహన్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పూలే భవనంలో మాజీ సైనిక సంక్షేమ శాఖ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌వో మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల సేవలు ఎనలేనివని చెప్పారు.సైనిక సంక్షేమ శాఖ మాజీ జిల్లా అధికారి రాఘవులు మాట్లాడుతూ.. ప్రస్తుతం కలెక్టరేట్‌లోకి మాజీ సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని మార్పు చేయడం జరిగిందన్నారు. ప్రారంభ కార్యక్రమంలో సిబ్బంది వినాయకరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భవనం ప్రారంభంలో డీఆర్‌వో మోహన్‌కుమార్

క్లుప్తంగా

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

గంగవరం : కుటుంబ గొడవల కారణంగా ఓ వివాహిత ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని కూర్నిపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, పలమనేరు మండలం పెంగరగుంట గ్రామానికి చెందిన శైలజ(21)తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. అయితే పెళ్లైనప్పటి నుంచి ఇప్పటి వరకూ భార్య, భర్తల మధ్య ఎలాంటి గొడవలు లేవు. వీరి దాంపత్య జీవితానికి సంకేతంగా ఏడాది పాప ఉంది. ఇదిలా ఉండగా కోడలితో అత్తలకు గొడవలు. అత్తలు అంటే ఆమె మామకి ఇద్దరు భార్యలు. అలా ఇద్దరు అత్తలు ఒకరికి ఒకరు తరచూ కావాలనే ఆమెని మాటలతో చిత్ర హింసలకు గురిచేయడం, ఆ విషయాన్ని భర్తకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరికి సర్ది చెప్పాలో తెలియక ఏం చెప్పలేకపోవడం జరిగేది. దీంతో చేసేది లేక మంగళవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త హుటాహుటిన ఆమెని చికిత్స కోసం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించి మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు బిజినెస్ ప్లాన్ పోటీలు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో విద్యార్థినులకు మహిళా వర్సిటీ, తిరుపతి ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంట్రా–ఇన్‌స్టిట్యూషనల్ బిజినెస్ ప్లాన్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఐఐఈ కోకన్వీనర్ లలిత, సభ్యులు రాజ్యలక్ష్మీ, రమాజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల్లోని వినూత్న వ్యాపార ఆలోచనలను ప్రదర్శించేందుకు పోటీలు దోహదపడతాయని వివరించారు. విద్యార్థులు 12 బృందాలుగా ఏర్పడి తమ బిజినెస్ ఐడియాలతో పోటీలో పాల్గొనడం హర్షణీయమన్నారు.

మెరిసిన ఆణిముత్యాలు

గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు ఎన్నో విప్లవాత్మకమైన విద్యా సంస్కరణలు తీసుకొచ్చారు. ఆ ఫలితం నేడు కనిపిస్తోంది. బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని సర్కారు బడుల విద్యార్థులు ప్రతిభ చాటారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు.

- ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఫలితాలు
- ఫలించిన గత సర్కారు సంస్కరణలు
- ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థుల ప్రతిభ
- పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు
- బంగారుపాళ్యం, విజయపురం మండలాల్లో అత్యధిక మార్కులు


592 మార్కులు సాధించిన మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని హేమ


592 మార్కులు సాధించిన విజయపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని అలేఖ్య

చిత్తూరు కలెక్టరేట్ : గతంలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయని విధంగా వైఎస్సార్‌సీపీ సర్కారు విద్యాభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేసింది. పేద విద్యార్థులు విద్యనభ్యసించే సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పించారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలుతో పేదింటి పిల్లల చదువులు సమున్నత స్థాయికి చేరాయి. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన అందించారు. దీంతో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెరిగాయి. తాజాగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా ..

ఒకప్పుడు కార్పొరేట్ విద్యారంగానికే పరిమితమైన స్టేట్ ర్యాంకులు, మండల ర్యాంకులను ప్రస్తుతం ప్రభుత్వ బడుల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. గత ఐదు సంవత్సరాల్లో జిల్లాలో విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు భవిష్యత్ రూపురేఖలను పూర్తిగా మార్చివేశాయి. సీబీఎస్ఈ సిలబస్ , అత్యుత్తమ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపునకు దోహదపడ్డాయి.

ప్రభుత్వ బడుల్లో మండలాల వారీగా ఇలా...

జిల్లాలోని ప్రభుత్వ బడులకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. హేమ 592 మార్కులు (మంగళపల్లి జెడ్పీ, బంగారుపాళ్యం), అలేఖ్య 592 మార్కులు(విజయపురం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్), చందు, మంజుల 590 (బైరెడ్డిపల్లి మండలం, కమ్మనపల్లి గురుకుల), రెడ్డి ప్రసన్న 589 (పుంగనూరు బాలికల పాఠశాల), భావన 588 (పలమనేరు బాలికల పాఠశాల), కుష్ నిహాజ్ 587 (పులిచెర్ల మండలం కల్లూరు జెడ్పీ) , సుష్మశ్రీ 587 (పెద్దపంజాణి మండలం శంకర్‌రాయలపేట బీసీ గురుకుల), దినీషా 586 (పూతలపట్టు మండలం పి.కొత్తకోట జెడ్పీ), శ్రావణి 586 (కుప్పం మండలం, గరిగశేపల్లి జెడ్పీ), రిషిత 585 (రొంపిచెర్ల మండలం ఏపీ మోడల్ స్కూల్), రితిక 584 (వి.కోట మండలం వి.కోట బాలికలు), యోగిత 583 (గంగాధర నెల్లూరు మండలం కాలేపల్లి జెడ్పీ), జయంత్ 583 (ఐరాల మండలం ఎం.పైపల్లి జెడ్పీ), సుదర్శన్ 582 (సదుం మండలం బీసీ గురుకుల), కౌసర్ 582 (చిత్తూరు అర్బన్ డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాల), సతీష్ 582 (నగరి మండలం చింతలపట్టెడ జెడ్పీ), విష్ణు 581 (ఎస్ఆర్‌పురం మండలం ఎస్ఆర్‌పురం జెడ్పీ), లిఖిత 580 (చౌడేపల్లి మండలం ఏ.కొత్తకోట జెడ్పీ), మేఘన 578 (వెదురుకుప్పం మండలం జక్కదొన జెడ్పీ), భానుప్రకాష్ 577 (సోమల మండలం పెద్దఉప్పరపల్లి జెడ్పీ), ప్రశాంత్ (కార్వేటినగరం మండలం కత్తెరపల్లి), హారతి (గంగవరం మండలం జీఎల్ఎస్‌ఫార్మ్ జెడ్పీ), భూమిక (యాదమరి మండలం డీకే చెరువు జెడ్పీ) 576 మార్కులు, జ్ఞానహర్ష (పెనుమూరు మండలం జెడ్పీ), సబీహా సధాఫ్ (రామకుప్పం మండలం రామకుప్పం బాలికలు జెడ్పీ) 571 మార్కులు, సింధుభార్గవి 568 (గుడిపాల మండలం కేటీపల్లి జెడ్పీ), ఇందుజా (శాంతిపురం మండలం ఏపీ మోడల్), స్వప్న (గుడుపల్లి మండల కేంద్రం జెడ్పీ) 567 మార్కులు, అభినయ 563 (పాలసముద్రం మండలం టీఆర్‌పురం జెడ్పీ), మానేష్ 554 (తవణంపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ), వికాస్ 545 (చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్‌పేట హైస్కూల్), అనుష్క 542 (నింద్ర మండల కేంద్రంలోని హైస్కూల్) లో ఉత్తమ ఫలితాలు సాధించారు.

గుడిపాల మండలంలో అత్యధిక ఉత్తీర్ణత

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో 67.06 ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో అత్యధికంగా గుడిపాల మండలం పదో తరగతి విద్యార్థులు 95.6 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా శ్రీరంగరాజపురం మండలంలో 35.83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మిగిలిన మండలాల్లో బైరెడ్డిపల్లిలో 66.98, బంగారుపాళ్యం 54.78, చిత్తూరు 75.92, చౌడేపల్లి 64.94, గంగాధర నెల్లూరు 60.09, గంగవరం 73.69, గుడుపల్లి 54.17, ఐరాల 68.77, కార్వేటినగరం 71.12, కుప్పం 61.65, నగరి 67.8, నింద్ర 66.49, పలమనేరు 70.56, పాలసముద్రం 81.87, పెద్దపంజాణి 70.49, పెనుమూరు 57.51, పులిచెర్ల 54.34, పుంగనూరు 72.61, పూతలపట్టు 85.91, రామకుప్పం 49.78, రొంపిచెర్ల 58.62, శాంతిపురం 57.62, సదుం 85.71, సోమల 75.14, తవణంపల్లి 80.66, వెదురుకుప్పం 70.64, వి.కోట 57.26, విజయపురం 70.71, యాదమరి 64.56 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

జర్నలిస్టులకు రక్షణేదీ?



చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట పాత్రికేయుల ధర్నా

- 'సాక్షి' కార్యాలయంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి
- దాడులకు పాల్పడడంపై మండిపడిన సంఘాలు
- చిత్తూరులో కదం తొక్కిన పాత్రికేయులు

చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జర్నలిస్టులకు రక్షణ కరవయ్యిందని, రాష్ట్రంలోని జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం.. భౌతిక దాడులకు పాల్పడటం పరిపాటిగా మారిందని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు లోకనాథన్ పేర్కొన్నారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిలా అధ్యక్షుడు లోకనాథన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చింతమనేని వేధింపులు తాళలేక టీడీపీకి చెందిన దంపతులు మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే.. ఆ వార్త రాసినందుకు సాక్షి కార్యాలయంపై దాడి చేయడం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు చేస్తూ.. పాత్రికేయ రంగాన్ని భయపెట్టాలని చూడాలనుకోవడం అవివేకమన్నారు. ఈ దాడులకు పాల్పడ్డ కూటమి నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పాత్రికేయులపై దాడులు జరగకుండా జర్నలిస్టుల రక్షణ కోసం కమిటీను ఏర్పాటు చేసి, దుండగులను శిక్షించే కొత్త చట్టాలను చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుని, జర్నలిస్టులకు రక్షణ కల్పించడానికి అసెంబ్లీలో చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఇషార్ అహ్మద్ మాట్లాడుతూ.. వార్త నచ్చకుంటే ఖండించాలని, వివరణ ఇవ్వాలని.. ఇలా భౌతికంగా దాడులకు పాల్పడటం ఎంత వరకు సమంజసమన్నారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, కాలేశ్వరరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు శివప్రసాద్, పవన్‌కుమార్, గంగాధర నెల్లూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుమలయ్య, జిల్లా సీనియర్ జర్నలిస్టులు హేమంత్‌కుమార్, శివకుమార్, వీర రాఘవులు నాయుడు, బాలసుందరం, హరీష్, రాజేష్, శ్రీనివాసులు, చిన్న, చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

కుప్పం కిరీటంపై కూటమి కన్ను

- సంఖ్యాబలం లేకపోయిన కూటమి ప్రలోభాలు
- న్యాయబద్ధంగా ఎన్నిక జరిగితే వైఎస్సార్‌సీపీదే విజయం
- అందరి దృష్టి మున్సిపల్ చైర్మన్ ఎన్నికపైనే!


కుప్పం మున్సిపల్ కార్యాలయం

కుప్పం : కుప్పం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వానికి మంగళవారం నోటిఫికేషన్ వెలువడడంతో చైర్మన్ ఎన్నికపై అందరి దృష్టి పడింది. సంఖ్యాబలం లేకపోయినా అధికార పార్టీ టీడీపీ చైర్మన్ కుర్చీని దక్కించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. న్యాయబద్ధంగా ఎన్నిక జరిగితే వైఎస్సార్‌కే చైర్మన్ పీఠం దక్కుతుంది.

నిజాయితీగా జరిగితే వైఎస్సార్‌సీపీకే...

ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం నిజాయితీ, నిబంధనలు, చట్టరీత్యా ఎన్నిక జరిగితే వైఎస్సార్ సీపీ మళ్లీ చైర్మన్ కుర్చీ దక్కించుకోవడం ఖాయం. కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులకు గాను 19 వైఎస్సార్ సీపీ గెలుపొంది చైర్మన్ కుర్చీ కైవసం చేసుకుంది. అధికారంలోకి వచ్చిన టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రలోభాలు ఎరగా వేసింది. ఈ క్రమంలో చైర్మన్ డా.సుధీర్ తన కౌన్సిల్ సభ్యత్వానికి, చైర్మన్ గిరికి రాజీనామా చేశారు. దీంతో ఆయన పోటీ చేసిన 16వ వార్డు కౌన్సిలర్ ఖాళీ కావడంతో పాటు చైర్మన్ కుర్చీ ఖాళీ అయింది. ప్రస్తుతం 19 మంది కౌన్సిల్ సభ్యుల్లో నలుగురు టీడీపీకి వెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీకి సంఖ్యాబలం 14 చేరింది. దీంతో సంఖ్యాబలం అధికంగా ఉన్న వైఎస్సార్ సీపీ చైర్మన్ కుర్చీ కైవసం చేసుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ 9 మంది కౌన్సిల్ సభ్యులతో ఉన్న అధికార పార్టీ చైర్మన్ గిరి దక్కించుకునేందుకు మల్లగుల్లాలు పడుతోంది.

వైఎస్సార్ సీపీ సభ్యులకు ప్రలోభాలు

అధికారం చేపట్టిన టీడీపీ ఎలాగైనా మున్సిపల్ కౌన్సిల్ ఎంపిక కోసం ప్రస్తుతం 9 మంది కౌన్సిల్ సభ్యులతో ఉన్న తెలుగుదేశం పార్టీ మరో ముగ్గురిని పార్టీలోకి లాగేయాలని ప్రలోభాలకు గురి చేస్తోంది. ఓ మహిళా కౌన్సిలర్ కుమారుడికి ఉద్యోగం కల్పిస్తామని ఆశ పెట్టారు. మరో ముగ్గురు కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

అందరి దృష్టి కుప్పం చైర్మన్ గిరిపైనే పడింది. టీడీపీ నుంచి ఇద్దరు, వైఎస్సార్ సీపీ నుంచి ఒకరు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎవరు చైర్మన్ అవుతారనే విషయం 28వతేదీన తేలనుంది.

టైర్ పరిశ్రమలో భారీ పేలుడు

- చెలరేగిన మంటలు
- భయాందోళనకు గురైన గ్రామస్తులు
- త్రుటిలో తప్పిన ప్రమాదం
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

నగరి : మండలంలోని నాగరాజకుప్పం మార్గంలోని దీపం టైర్ పరిశ్రమలో బుధవారం ఉదయం భారీ పేలుడు శబ్దం వచ్చి అగ్ని ప్రమాదం సంభవించింది. అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగాయి. ప్లాంటుపై ఉన్న ఇనుప రేకులు ఒక్కసారిగా ఎగిరి పొగలు కక్కుతూ పక్కనే ఉన్న రోడ్డుపై పడ్డాయి. ఒక్కసారిగా పెద్ద ఎత్తున పేలుడు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్లాంటు పక్కనే ఉన్న రోడ్డులో తరచూ ద్విచక్ర వాహనదారులు సంచరిస్తూ ఉంటారు. అదృష్టవశాత్తు ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ ప్రయాణించక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కార్మికులు ప్రమాదాన్ని ముందే పసిగట్టి బయటకు వచ్చేయడంతో ఎవరూ గాయపడలేదు.

తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఉదాసీనతే..

ఈ పరిశ్రమలో అగ్ని ప్రమాదం ఇది వరకే సంభవించి పేలుడు దాటికి విద్యుత్ స్తంభాలు వంగిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్లాంటుకు ఆనుకొని నాగరాజకుప్పం, బీరకుప్పం, ఓజీకుప్పం, కృష్ణాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఉంది. ప్లాంటుకు కూతవేటు దూరంలోనే సుమారు 1300 మందికి కేటాయించిన జగనన్న కాలనీ ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. టైర్లు కాల్చే దుర్వాసన కాలనీలోని నివాసాల వరకు వ్యాపిస్తోందని. దానిని భరించలేకున్నామని స్థానికులు చెబుతున్నారు. ప్లాంటు పక్కన రోడ్డుపై వెళ్లే సమయంలో ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం మంటలు చెలరేగడంతో దుర్వాసన రెట్టింపైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాసాలకు సమీపంగా ఉన్న ప్రమాదకర పరిశ్రమ నివాసాలకు దూరంగా మార్చి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. పేలుడు శబ్దం వినిపించినా ప్లాంటు యజమానులు మాత్రం షార్ట్ సర్క్యూట్ కారణంగా టైర్లు మండి ప్రమాదం సంభవించిందని తెలుపుతోంది.


మండుతున్న టైర్ ప్లాంటు

ఘనంగా భాష్యకారుల ఉత్సవం

తిరుమల : శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. మే 2న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంత పరంగా మీమాంస గ్రంథానికి 'శ్రీభాష్యం' పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు.

ప్రైవేటు చేతికి అస్త్రం

- వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష ప్రైవేటు పరం
- జిల్లాలో ప్రత్యేకంగా టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- వాహనాల పరీక్షలపై అనుమానాలు

కాణిపాకం : ప్రభుత్వ సేవల్లో అత్యంత ప్రధానమైన, ప్రజలకు ఉపయోగకరమైన సేవలను ప్రైవేటుకు కట్టబెట్టే ప్రక్రియ జరుగుతోంది. రైల్వే శాఖలో పలు సేవలను ఇప్పటికే ప్రైవేటుకు అప్పగించారు. తాజాగా ఆ జాబితాలోకి రాష్ట్ర రవాణా శాఖ కూడా చేరింది. ఇందులో అత్యంత కీలకమైన వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ సేవలను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఈ మేరకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బదిలీ విధానం వేగంగా సాగిపోయింది.

ప్రతి జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ మంజూరైంది. ఇప్పటి వరకూ రవాణా శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు, ఇకపై లైట్, హెవీ మోటార్ వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లను ప్రభుత్వం నిర్ణయించిన ప్రైవేటు సంస్థ మాత్రమే జారీ చేస్తుంది. ఈ సంస్థపై స్థానికంగా ఎవ్వరి అజమాయిషీ ఉండదు. కేంద్ర ప్రభుత్వమే నేరుగా పర్యవేక్షిస్తుంది.

జిల్లాలోని వాహన వివరాలు..	
వాహనరకం	సంఖ్య
ద్విచక్రవాహనాలు	290589
కార్లు	23541
ఆటోలు	6116
గూడ్స్ క్యారియర్లు	17181
అగ్రికల్చర్ ట్రాక్టర్లు, ట్రాలీలు	17115
కమర్షియల్‌ట్రాక్టర్లు, ట్రాలీలు	3369
స్కూల్, కాలేజీ బస్సులు	1105
బస్సులు	980
ఇతర వాహనాలు	7012

సర్టిఫికెట్ల జారీ

జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల వాహనాలు 3,67,008 ఉన్నాయి. వీటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా ఒక్కో జిల్లా నుంచి రూ.కోట్లలో ఆదాయం సమకూరేది. దీనిని ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో ఆ మేరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. కేంద్ర ట్రాన్స్‌పోర్ట్ ఇండియా సలహా మేరకు వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ కోసం వసూలు చేసిన సొమ్మును ఫిట్‌నెస్ స్టేషన్లు రెండేళ్ల పాటు తమ సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక్క పైసా చెల్లించనక్కరలేదు. ఈ మేరకు టెండరలలో నిబంధన పెట్టారని చెబుతున్నారు.


బంగారుపాళ్యం మండలంలో త్వరలో ప్రారంభం కానున్న ఫిట్‌నెస్ సెంటర్

బంగారుపాళ్యం వద్ద టెస్టింగ్ స్టేషన్..

జిల్లాకు సంబంధించి బంగారుపాళ్యం మండలం మహాసముద్రం టోల్‌గేట్ సమీపాన సుమారు రూ.4.5 కోట్లతో వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో ప్రారంభానికి నోచుకోనుంది. ఈ స్టేషన్‌లో మెషీనరీతో పాటు 21 మంది సిబ్బంది పనిచేయనున్నారు. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ ఇక్కడే జరుగుతాయి. సిబ్బందిని సైతం సంబంధిత ప్రైవేటు ఏజెన్సీ నియమించుకుంటుంది. ఇందులో రాష్ట్ర రవాణాశాఖ అధికారుల ప్రమేయం కాని, అజమాయిషీ కానీ ఏమాత్రం ఉండదు.

పారదర్శకత ప్రశ్నార్థకం

వాహనాల ఫిట్‌నెస్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. అప్పుడే ప్రమాదాల నుంచి గట్టెక్కే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం. అన్నీ ప్రైవేటు వ్యక్తులే చేస్తుండటంతో పారదర్శకత పై ఆందోళన వ్యక్తమవుతోంది. ఎటువంటి లోటుపాట్లు లేకుండా టెస్టులు నిర్వహిస్తే మంచిదేనని, తమకు ఎవరూ నియంత్రించలేరంటూ ఎలాపడితే అలా చేస్తే ప్రమాదాలు తప్పవని పలువురు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి..ఈ టెస్టులో మార్పులు చేసి పారదర్శకతను జోడించాలని పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఫిట్‌నెస్ టెస్ట్ ఇలా..

రోడ్లపై తిరిగే ప్రైవేటు బస్సులు, కార్లు, క్యాబ్, ట్రాక్టర్లు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్యాంకర్లు, స్కూల్ బస్సుల వంటి ప్రతి వాహనానికీ ఫిట్‌నెస్ టెస్టులు తప్పనిసరి, పసుపు రంగు నంబర్ ప్లేట్ ఉంటే ట్రాన్స్‌పోర్ట్, తెలుపు రంగు నంబర్ ప్లేట్ ఉంటే నాన్- ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణిస్తారు. కొత్త వాహనానికి లైఫ్ టైంలో మొదటి ఎనిమిదేళ్లలో ప్రతి రెండేళ్లకోసారి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. ఎనిమిదేళ్ల తర్వాత ఏడాదికోసారి ఈ పరీక్ష తప్పనిసరి. 15 ఏళ్లకు కండిషన్ చూసి, ఆపేయాలి, స్కూల్ బస్సులకు 15 ఏళ్ల వరకే ఫిట్‌నెస్ చూస్తారు. తర్వాత వాటిని స్కూల్ బస్సుల కింద వాడకూడదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీని ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో వాహన తనిఖీలు ఎంత వరకూ సక్రమంగా జరుగుతాయనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో రవాణాశాఖ కార్యాలయాల్లో ఫిట్నెస్ పరీక్షలు ప్రహసనంగా జరిగేవి, కొందరు. అధికారులు మామూళ్లు దండుకుని చూసీ చూడనట్లు వ్యవహరించేవారు. దీంతో, ప్రమాదాలు చోటు చేసుకునేవి. ప్రధానంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌లో ఇలాంటి ఘటనలు తరచుగా జరిగేవి. ఇప్పుడు ప్రైవేటు చేతిలో పెడితే అటువంటి పరిస్థితులే ఎదురైతే ఎలాగనే ప్రశ్న వాహనదారులు, ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. ప్రైవేటు ఏజెన్సీపై పర్యవేక్షణకు జిల్లాలో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి


లక్ష్మి (ఫైల్)

చౌడేపల్లె : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చౌడేపల్లె మండలంలోని గోసలకురప్పల్లెలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగరాజ , నాగమ్మలకు ముగ్గురు కుమార్తెలు. తండ్రి కొన్నేళ్ల కిందట మృతి చెందగా తల్లి నాగమ్మ, అక్క మంజులతో కలిసి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.లక్ష్మి(34) నివసిస్తున్నారు. చౌడేపల్లె సర్కిల్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లక్ష్మి ఇటీవల బదిలీల్లో భాగంగా గుడిపల్లె పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. లక్ష్మి భర్త హరి ప్రసాద్ పలమనేరులోని ఓ ప్రవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. మృతురాలి తల్లి నాగమ్మ, అక్క మంజులతో పాటు కలిసి ఇంట్లో మాట్లాడుతుండగా ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో తన అక్క కుమార్తెతో భర్త సరిగా మాట్లాడలేదని ఎందుకని ప్రశ్నిస్తూ భర్తను కానిస్టేబుల్ లక్ష్మి నిలదీసిందన్నారు. భర్త కుటుంబ సభ్యుల ముందు సమాధానం చెప్పకపోవడంతో కోపంతో హాలులో నుంచి బెడ్ రూములోకి లక్ష్మి కోపంగా వెళ్లి తలుపు గడియ పెట్టుకొందని, ఈక్రమంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొందన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. లక్ష్మి మృతితో గోసలకుర్పల్లెలో శోక సంద్రంగా మారింది.